

## ఇచ్ఛాపురపు జగన్నాధరావు

కంపెనీ పనులమీద దక్షిణ దేశంలో చాలా ఊళ్లు తిరిగితిరిగి సుమారు నెల రోజుల తరవాత తన ఊరు చేరుకున్న గోపాలరావు మర్నాడు విధిగా క్లబ్బు కని బయలుదేరాడు. ఆ ఊరిలో ఉన్న ఆ క్లబ్బు అతని తరగతి అంటే, మధ్యతరగతి వారికి ఉద్దేశించి ఉన్నా గోపాలరావు అక్కడికి తరచు వెళ్ళడు నెలసరి చందా మట్టుకు సకాలంలో

తప్పకుండా చెల్లించి సభ్యత్వాన్ని కాపాడుకుంటాడు. ఒకొ్కక్కప్పుడు చందా చెల్లించడానికి కూడా అతను క్లబ్బుకి రాలేకపోవడం ఉండేది. అలాటప్పుడు అసిస్టెంటు చేత డబ్బు పంపేసేవాడు.

అందుచేతనే అతను క్లబ్బుకిరావడం ఒక విశేషం.

అందులోనూ ఈసారి కేంపుకి వెళ్ళేముందూ, మళ్ళీ ఆ రోజూ - ఒకే నెలలో రెండుసార్లు రావడంతో అందరూ అతన్ని ఆశ్చర్యంగానూ, కొంత అభిమానంతోనూ ఆహ్వానించేరు. రమ్మీ టేబిలుదగ్గర కూడా రెండు నిమిషాలు అతని గౌరవార్థం లాగ ఆట ఆగిపోయింది.

"ఏమిటి ఈ అసాధారమైన మీ రాక?" అన్నాడు స్వామి. అతను నాటకాల్లో వేషాలు వేస్తాడనీ, గొప్ప నటుడనీ అందరూ-అంటే అతని దగ్గర అవసరం ఉన్నవాళ్లు, అంటూంటారు.

"ఊరక రారు మహాత్ములు" అన్నాడు శ్రీనాథ. అది అతని పేరు కాదు. కవిత్వం ఆ కలం పేరుతో రాస్తూంటాడు. ముందర అతని కవిత్వం స్కూలు సాంవత్సరిక సంచికల్లోనూ, రాత పత్రికల్లోను మాత్రమే ప్రచురణ అయినా, తరవాత తరవాత ఒకటి రెండు మాస, వార పత్రికలు కూడా అతని గేయాల్ని ప్రచురించడంతో అతను జుత్తూ, గడ్డం పెంచి, లాల్చీ వేసుకుని తిరుగుతూ శ్రీనాథ అని పిలిస్తేనే పలుకుతాడు. అసలు పేరు పెట్టి పిలిస్తే అతనికి పడదు. ఎవరైనా కవిగారని పిలిచినా అతనికి అభ్యంతరం లేదు. అతనేం అన్నా కవిత్వంగానూ, అదీ అతని సొంత, అనుకవితగా భావించి అందరూ మెచ్చుకుంటారు.

గోపాలరావు రీడింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నాడు. ఏడెనిమిది మంది అతని చుట్టూ చేరారు.

"ఏమిటి మీ యాత్రా విశేషాలు?" అన్నారు హిస్టరీ మాస్టారు. ఆయన నిజంపేరు చాలామందికి తెలీదు. అదే అతని పేరు.

"ఏముందీ! ప్రత్యేకం?" అన్నాడు గోపాలరావు.

"మీరలా అంటారుగాని, అన్ని ఊళ్ళు తిరిగి వొచ్చాక - వెచ్చవెచ్చటి విశేషాలు ఏమీ లేవంటే నమ్మొద్దుటండీ?" అన్నాడు శ్రీనివాస్. అక్కడ ఫారెస్ట్ డిపార్ట్‌మెంటులో కాబోలు అతను - గొప్ప రొమాంటిక్ మనిషి అని అంటే కాఫీ ఇప్పిస్తాడు.

"పోనీ, మీ రేంచెప్పినా మీ ఇంట్లో చెప్పండెండి" అన్నాడు బంగారయ్య. అతను వ్యాపారస్థుడు. తనంత నమ్మకం మనిషిలేడు అని అతని నమ్మిక.

గోపాలరావు అందరికీ సమాధానంగా నవ్వి ముందరగా శ్రీనివాస్‌వేపు చూసి, "మీలాటి యువకులు ఇంట్లో కూర్చున్నా రొమాన్సు గాని, నా ఈడు వాడికి ఎక్కడికెళ్ళినా అలాటి అదృష్టం పట్టదండీ!" అన్నాడు.

లెక్కపెట్టి శ్రీనివాస్ మూడు కాఫీలు తెమ్మన్నాడు. బంగారయ్య అతనికి అడపాదడపా అప్పులిస్తాడు గనక ఆమాత్రం గౌరవం ఉంచాలి.

మిగిలిన వాళ్ళూ వొంతులు వొంతులుగా కాఫీలు తెప్పించుకున్నారు.

ఆ కబుర్లూ ఈ కబుర్లూ అయాక అందరివేపూ ఒక్కసారి చూసి, కొంత సందేహంగానే, "ఒక్క చిన్న విశేషం ఉంది .... కోయంబుత్తూరునించి మద్రాసు వొస్తోంటే ...." అని ఆగేడు.

"అదుగో! మాస్టారు అసలువిషయం చివరికి దాచారు.... అదే కథాశిల్పం" అన్నాడు కనకరాజు. అతను ఈ మధ్య కథలు రాస్తున్నాడు.

"కథాలేదు - కాకరకాయా లేదు.... మన విశ్వంగురించి - అంతే" అన్నాడు గోపాలరావు.

నిమిషం ఎవరూ మాట్లాడలేదు.

విశ్వం!

హిస్టరీ మాస్టారు ముందుగా సర్దుకుని దాచుకోని కోపంతో, "ఆ తుచ్ఛుడా?" అన్నారు ఉమ్మేస్తోన్నట్టు. మూడు నాలుగేళ్ళ కిందట - ఆయనగారి మూడో భార్యతో కొత్త కొత్తగా పాత చరిత్ర విశ్వం తిరగవేసి రాశాడని ఆ ఊరిలో వాడుక.

"ఆ దౌర్భాగ్యుడు - మీకు దాపరించేడా!" అన్నాడు బంగారయ్య. అతని దగ్గర వెయ్యి రూపాయలు పుచ్చుకుని ఎగవేశాడని అందరికీ తెలుసు మరి.

"రైల్లోనించి కిందకి తోసేవలసింది" అన్నాడు శ్రీనివాస్. అతని కోపానికే న్యాయమైనదీ, రొమాంటిక్‌గా ఉన్నదీ కారణం ఉంది. ఒకసారి ఆ ఊరి డాక్టరుగారి ఇంటికి వెన్నెలలాటి అమ్మాయి వేసంగి సెలవులకి వొచ్చింది. వాళ్ళింటి పక్కనే ఆఫీసు శ్రీనివాస్‌ది. అతను ఆమెని జయించడమే ధ్యేయంగా పెట్టుకుని నానా హింసాపడితే ఆ వెన్నెల వెళ్ళి విశ్వందగ్గర కూర్చునేది- అస్తమానం.... తప్పుడు మనిషి.

"వాడి రక్తం ఎముకలూ కుళ్ళి కుళ్ళి రాబందులకి కూడా అసహ్యం వేసే రోజు ఇంకా రాలేదా రానేలేదా" అన్నాడు శ్రీనాథ. ఇది అతని మొదటి ఆసువు. కాని ఎవరూ పట్టించుకోలేదు.

స్వామి చిన్నరకం గర్జన ఒకటి చేశాడు. రెండుచేతుల్లో ఏదో అదృశ్యమైనది - విశ్వం అయి ఉంటుంది - పిండుతూ, "ఆ దుర్మార్గుడు! హుం!" అన్నాడు. అతను నూరు మాటల్లో చెప్పలేనిది, అలా క్లుప్తంగా చెప్ప

గలిగాడు. అతనికి విశ్వంమీద మొదటి నించీ అభిమానం లేదుగాని, నాటకంలో నాయిక పాత్రధారిణి అతన్ని అంత దూరంలో ఉంచి, విశ్వం చుట్టూ తిరిగి తిరిగి.... చివరికి నాటకం రోజున - స్టేజిమీదకి రానని భీష్మించడమేకాక - విశ్వం నాయకుడిగా ఉంటేనే నటిస్తానని అనడం అతనీ జన్మలో మరిచిపోలేడు. ఆనాడు నాటకం మరీ రక్తి కట్టడం మాత్రం అతనెలాగ మరిచిపోతాడు?

ఎవరూ విశ్వం ఎలాగ ఉన్నాడని అడగలేదు. కాని కనకరాజు .... "ఆ దరిద్రుడు మిమ్మల్ని కలిశాడా ? .... ఏమైంది?" అన్నాడు. నిజ జీవితంలో సంఘటనలని పూర్తిగా అవగతంచేసు కోవాలని అతనెక్కడో చదివేడు. అదీ కాక, విశ్వం కనకరాజుకి పెద్ద అన్యాయం ఏదీ చెయ్యలేదు. ఒకసారి అతను రాసిక కథ చూపెడితే, మరో ప్రఖ్యాత రచయిత పేరుచెప్పి, "అతని ఉద్దేశం అడుగు; నా దేముందీ?" అన్నాడు. అంతే - దానికి పూర్తిగా కాకపోయినా చాలావరకూ క్షమించాడు విశ్వాన్ని కనకరాజు.


విశ్వానికి గోపాలరావు అప్రియమైనది ఏదో ఒకటి చేసిఉండకపోడనీ అదే అతనందరికీ చెప్దామనుకుంటున్నాడనీ క్రమంగా అందరికీ లోలోపల నమ్మిక కలిగింది.

నెమ్మది నెమ్మదిగా, ఏం జరిగిందో చెప్పమన్నారు.

వాళ్ళకి ఇష్టమైనదీ, వాళ్ళు వినగోరేదీ ఏమీ జరగలేదు. కాని, గోపాలరావులో కొంత న్యాయం ధర్మం ఉంది. అతనికి వీళ్ళెవ్వరి కోపం అన్నా పెద్ద భయము లేదు.

జరిగింది జరిగినట్టు చెప్పేడు....

అప్పుడు కొంచెం బరువుగా భోజనం చేసి రైలు ఎక్కేడేమో, గోపాలరావు చిన్న నిద్దుర తీసే ప్రయత్నంలో



ఉన్నాడు. ఎయిర్ కండిషన్ చేసిన కుర్చీలో అది చాలా హాయిగా ఉంది.

కొంతసేపు నిద్రఅయి, ఎవరో తట్టినట్టయితే, కళ్ళు విప్పేడు.

ఎదురుగా చిరునవ్వుతో, విశ్వం.

రెండు క్షణాలు పట్టింది, అతన్ని గుర్తించేందుకు. మనిషి కాస్త తెల్లబడ్డాడు - ఎప్పటికన్నా కాస్త స్మార్ట్‌గా ఉన్నాడు.

"హల్లో గోపాలరావ్ గారూ!" అన్నాడు, పక్కన ఖాళీ కుర్చీలో కూర్చుంటూ.

లేచి వెళ్ళి ముఖంకడుక్కుని వచ్చి, "మీరేనా, మరెవరో అనుకున్నాను" అన్నాడు గోపాలరావు. అతనికి విశ్వం సంగతులన్నీ బాగా తెలుసును.

నవ్వుతూ "నేనేనండీ!" అన్నాడు.

"ఎక్కడ ఉంటున్నారు?.... ఏం చేస్తున్నారు?" అన్నాడు గోపాలరావు, ఉత్సాహంగా. అతనికి తెలియకుండానే విశ్వంమీద అడ్మిరేషన్ అతనికి.

విశ్వం చెప్పేడు.

"ఈ ఊరిలో మళ్ళీ అడుగుపెట్టను" అని అతను వెళ్ళిపోయిన మూడేళ్ళలో చాలా జరిగాయి.

ముందుగా బొంబే వెళ్ళి ఒక సంవత్సరం రకరకాల బాధలు పడ్డాడు.

తిన్ననాడు తిండి.


లేనినాడు మంచినీళ్ళ విందు.

ఎక్కడ జాగా దొరికితే అక్కడ నిద్ర.

పార్కులో....

చౌపట్టే ఇసకలో.

మెరీన్ డ్రైవ్ పేవ్‌మెంటు మీద.




సంవత్సరం దాటేక అతని అదృష్టం తిరిగింది.

ఒక పెద్ద శేఠ్, గారి చిన్నపిల్ల బీచ్‌లో ఆడుకుంటూంటే విశ్వం చూసి, తన జీవితాన్నీ, ఆ చిన్నపిల్ల జీవితాన్నీ సరిపోల్చుకుంటూంటే, జరిగిన ఉదంతం అతని జీవితాన్ని మార్చేసింది.

ఆ అమ్మాయిని తీసికెళ్ళిపోయాడు నౌకరు... విచిత్రంగా, ఆమె చేతిలో స్వీట్స్ పెట్టి.

విశ్వం వెళ్ళినదారిని గమనిస్తూనే ఉన్నాడు. ఒక టేక్సీలో కూర్చుని, సర్వెంటు అడ్రస్ చెప్పడం కూడా విన్నాడు-ఎందుకో ఆమె వెనక కొంచెం దూరం నడిచి, అడ్రస్ విని ఆశ్చర్య పడ్డాడు. శ్రీమంతులు ఉండే చోటు కాదది!

మరో పదినిమిషాలలో తెలిసింది.

పిల్లని తీసికెళ్ళినవాడు నౌకరు కాదు. దొంగ.

తల్లీ తండ్రీ కబుర్లలో పడి గమనించలేదు - వాళ్ళు గమనిస్తున్నా రనుకుని ఆయా టీ తాగడానికి వెళ్ళింది.

నిమిషంలో పోలీసులు వొచ్చేరు.

తల్లి హృదయపూర్వకంగా ఏడు స్తోంది.

తండ్రి విలవిలలాడి పోతున్నాడు - ఒక్కటే సంతానం వాళ్ళకి.

దూరంనించి గమనించిన విశ్వం అక్కడికి వొచ్చాడు. ఆ ముందరిరోజు కొంతడబ్బు చేతికి రావడాన్న అతను బికారిలాగ లేడు. లేకుంటే, అతని మాటలు ఎవరూ పట్టించుకుని ఉండే వారు కాదు.

జరిగినది పోలీసుకి చెప్పేడు. టాక్సీ నంబరు చెప్పేడు - చిన్నప్పటి నించీ అతనికి సంఖ్యలమీద కొంత సరదా ఉంది.

అరగంటలో పోలీసులు వైర్లెస్ సాయంతో టాక్సీనీ, పిల్లనీ, నేరస్థులనీ కూడా పట్టుకుని తీసుకొచ్చారు.

శేఠ్ జీ కృతజ్ఞతకి హద్దులు లేవు!

వెయ్యి రూపాయిలు ఇనాం ఇస్తా నన్నాడు.

వొద్దన్నాడు విశ్వం.

రెట్టింపు -

అయిదువేలు!

వొద్దన్నాడు విశ్వం. అతని మన సులో ఒక ఆలోచన పనిచేస్తోంది.

"మరేం కావాలి?" అన్నాడు శేఠ్.

"నీ దగ్గర ఉద్యోగం ఇయ్యి" అన్నాడు విశ్వం. శేఠ్ అతన్ని ఇంటికి తీసికెళ్ళి భోజనం పెట్టి అతని కథ అంతా విని, ఆశ్చర్యపోయాడు. వెంటనే అతనికో మేనేజరు పని ఇచ్చాడు. అది కాక ఏ వ్యాపారంచేసినా మదుపు పెడతా నన్నాడు.

ఆ రోజునించే, విశ్వం జాతకం మారి పోయింది. నెలజీతం అక్కడ తీసు కుంటూ, పైన ఒక ఎగుమతి వ్యాపారం పెట్టేడు.

ఆ సందర్భంలోనే కోయంబత్తూరు వొచ్చాడు.

సొంతవ్యాపారం దివ్యంగా సాగు తోంది.

"పెళ్ళీ అదీ...." అన్నాడు గోపాల రావు.

"లేదండీ!.... మా శేఠ్‌గారి మేన గోడలు ఉంది .... బహుశా ...." అన్నాడు విశ్వం - కొంచెం సిగ్గుపడి పోతూ.

"అయితే - ఇంక లక్షాధికారి అయి పోతారన్న మాట!" అన్నాడు గోపాల రావు.

చిన్న చిరునవ్వుతో, గర్వం దాచు కుంటూ, "అది - అయానండీ!" అన్నాడు విశ్వం - "కేష్‌కాదనుకోండి... నా షేర్లూ, డిపాజిట్లూ - చిన్న ఇల్లూ - అన్నీ లక్ష దాటాయి"

"గుడ్!.... మీ పెళ్ళికి అడ్వాన్సు శుభాకాంక్షలు" అన్నాడు గోపాలరావు.

"థేంక్స్! అమ్మాయి బాగుంటుంది కాని అంతకన్నా ముఖ్యం - వాళ్ళిచ్చే లక్షరూపాయిల కేష్ .... వ్యాపార మూనూ" అన్నాడు జేబులోనించి ఫోటో తీసి చూపెడుతూ. "గుడ్" అన్నాడు మళ్ళీ గోపాలరావు.

కొంతసేపు నిశ్శబ్దం తరవాత, హటాత్తుగా "మీరు ఊరు వొదిలి అలా వెళ్ళిపోవడం....నాకు బాధకలిగించింది" అన్నాడు గోపాలరావు.

విశ్వం బాధగా నవ్వి, "అక్కడ

జరిగినదాని తరవాత – ఏం చెయ్యను?" అన్నాడు.

"కాని – " అన్నాడు గోపాలరావు.

"అడగండి" అన్నాడు విశ్వం.

అడిగాడు.

అతని సమాధానాలు గోపాలరావు సభికులకి చెప్పలేదు.

కాని....


హిస్టరీ మాస్టారి మూడో భార్య అతన్ని.... బ్రతిమాలీ, భయపించీ – దగ్గరికి తీసుకుంది. గుట్టుగా ఉంచమని తప్ప మాస్టారు అభ్యంతరం చెప్ప లేదు.... ఒకనాడు పొరపాటున కథ బయట పడేదాకా. నింద విశ్వానిది. అత నేమీ అనలేదు.

బంగారయ్య విశ్వానికి ఇచ్చింది వెయ్యికాదు – అయిదొందలు! .... వెయ్యి అని వాదిస్తే కాదన్నాడు విశ్వం.... కాని, సంవత్సరం కిందట అయిదు వొందలకి డ్రాఫ్ట్ పంపేడు. బంగారయ్య ఆ సంగతి ఎవరికీ చెప్ప లేదు.

శ్రీనివాస్–ఆ డాక్టరుగారి అమ్మాయికి అసభ్యమైన ప్రేమలేఖలు రాస్తే, ఆమె అవి విశ్వానికి ఇచ్చింది. విశ్వం ఆమెకి దూరపు చుట్టం – ఇంతకు ముందే తెలుసును. విశ్వం శ్రీనివాస్‌కి బాగా చీవాట్లు పెట్టి, మళ్ళీ అలాటి పనులు చెయ్యనని హామీపత్రం పుచ్చు కున్నాడు. ఆ ఉత్తరాలూ, హామీపత్రం ఇప్పటికీ విశ్వందగ్గర ఉన్నాయి.

నాటకం మాట – నిజమే! కాని, ఆమెమీద ఎవరికీ హక్కులు లేవు– స్వామి అతి మోటగా ఆమెని లొంగ దీసుకునే ప్రయత్నంతో ఆమె ఎదురు తిరిగింది. స్వామి – అతనికి నటన అంటే అర్థంకూడా తెలీదు – ఉన్నదంతా కీర్తి కాంక్ష మాత్రమే.

ఈ వివరాలన్నీ చెప్పలేదు.



కాని, తన కంపెనీలో షేర్లకోసం తాను రెండువేల రూపాయిలు అక్కడి కక్కడే ఇచ్చిన మాట మాత్రం చెప్పేడు గోపాలరావు. "వొచ్చేవారం కంపెనీ ఎనౌన్స్ చేస్తున్నాం.... అను కున్నట్టు వ్యాపారం జరిగితే పాతికపైగా డివిడెండు వొస్తుంది... ఇప్పటికే చాలా మంది బలవంతంచేస్తున్నారు. కాని నాకు మన వూరిమీద మమత పోలేదండీ! అక్కడ కాస్త పెద్దమనుషులు మీరే కనక, మీకు ఈ అవకాశం ఇస్తున్నాను" అన్నాడు విశ్వం. తగినవిధంగా మార్చి చెప్పేడు గోపాలరావు.

"ఎంత ఇచ్చేరు?" అన్నాడు బంగారయ్య.

"రెండు వేలు" అన్నాడు నిజం చెప్తూ, గోపాలరావు.

శ్రీనివాస్ నవ్వేడు.

స్వామి జాలిపడ్డాడు.

"ఇంత వ్యాపారం చూస్తారు కదా! అంత సుళువుగా బోల్తా ఎలాగ పడ్డారు?" అన్నాడు హిస్టరీ మాస్టారు.

"వాడు చేసింది మోసం! అంతా మీ డబ్బుకోసం ఆశపడ్డారు! టోపీలో పడ్డారు" అన్నాడు శ్రీనాథ.

అందరూ ఏకగ్రీవంగా గోపాలరావు మీద జాలిపడ్డారు. విశ్వం ఫోర్ ట్వంటీ – వాడి తలకాయ – వాడికి వ్యాపారం ఏమిటి? ఇక్కడ జరిగింది తెలీదూ? తండ్రి పోవడం ఏమిటి, ఆస్థి తగలెయ్యటం ఏమిటి, ఎంత త్వరగా జరిగేయి?

చివరికి నిజమే అనుకున్నాడు గోపాలరావు. విశ్వం తనకి రుజువులని గురించి చెప్పడమేగాని ఒక్కటీ చూపలేదు.

తన మీద అంత అవ్యాజమైన అనురాగం కలగడంకూడా అసహజంగా ఉంది!

కాని – విశ్వం కార్డు ఇచ్చేడు!

పర్సులో ఉండాలి.

వెదికేడు.


అది కనపడలేదు.

"ఇచ్చినట్టే ఇచ్చి తీసేసుకుని ఉంటాడు" అన్నారు. ఒకాయన అది అదృశ్యం అయిపోయే సిరాతో అచ్చువేసి ఉంటాడనీ అన్నాడు.

"కాని, కనీసం తెల్లకార్డేనా మిగలాలి కదా!" అన్నాడు గోపాలరావు.

"అదీ–అలాగే తయారుచేసి ఉంటారు. మనవాళ్ళెంతకేనా తగుదురు!" అన్నారు హిస్టరీ మాస్టారు.

గోపాలరావు ఏమీ అనలేకపోయాడు–




"పోనీండి! మన ఊరివాడు! ఏదో అవసరానికి తీసుకున్నాడు!" అని తప్ప.

పాపం!

మోసం!

ఫోర్ ట్వెంటీ!

అలాగ అంటూ అందరూ నెమ్మదిగా జారుకున్నారు.

రెండు సంవత్సరాలు జరిగినా, విశ్వం నించి ఉత్తరంలేదు. డివిడెండు చెక్కూ లేదు. గోపాలరావుకి క్రమంగా అతని మీద కోపం పెరిగింది. ఊరిలో కాకుండా తనని బయట దగాచేశాడు!

విశ్వం సంగతి ఈ మధ్య తరచూ వొస్తోంది క్లబ్‌లో.

క్రమంగా, అతనిమీద గోపాలరావు కోపం అందరికీ తెలిసివొచ్చింది. ఆ డబ్బు మీద ఆశపోయింది అతనికి.

ఆ పరిస్థితిల్లో అతనికి ఒక రిజిస్టర్డ్ ఉత్తరం వొచ్చింది.

లోపల పన్నెండు వందలకి చెక్కూ, రెండు సంవత్సరాలు దాటేక గాని, అసాధారణ పరిస్థితులవల్ల డబ్బు పంపలేనందుకు క్షమాపణ, ఉన్నాయి. నూరు రూపాయిల ఆ షేర్లు మార్కెట్‌లో రెండు వందల ఏభై కి పోతున్నాయనీ, అమ్మడం ఇష్టమైతే తెలియజెయ్యమనీ కూడా ఒక నోట్ ఉంది.

వారం రోజులు తీవ్రంగా ఆలోచించాడు గోపాలరావు.

వెంటనే అమ్మితే, అయిదు వేలు వొస్తాయి –

లేకపోతే, సంవత్సరానికి ఆరు వొందలు....

కాని–

ఎవరినైనా అడగాలంటే వీలులేని పరిస్థితి.

ఎందుకంటే, గోపాలరావు ఈ చెక్ సంగతి ఎవ్వరికీ చెప్పలేదు. రెండు సంవత్సరాలు తనని ఫూల్‌గా భావించారు ఇక్కడ అందరూ. అంతకన్నా ముఖ్యం, తనకీ తాను ఫూల్‌గా కనిపించేడు. అందుకే అతను విశ్వాన్ని క్షమించదలుచుకోలేదు.

షేర్లు అమ్మడంలో అతనికి లాభం కనిపించలేదు. కాని విశ్వం మోసగాడైతే, ముమ్ముందు మళ్ళీ డివిడెండు వొస్తుందని నమ్మిక ఏమిటి?

దీనికి సమాధానంగా, రసీదు కూడా లేకుండా ఇచ్చిన డబ్బుకి షేర్లూ, వాటి మీద డివిడెండూ ఇవ్వాల్సిన అవసరం లేని విశ్వం అవి ఇవ్వడం అతనికి జ్ఞాపకం వొచ్చింది.

ఎందు కిచ్చాడు?

ఫూల్ కనక.

అది ఇచ్చి తన దగ్గర ఇంకా లాగుదామని ప్రయత్నం అయిఉంటుంది!

కాని....

తనమీద విశ్వానికి నిజంగా అభిమానం ఉందేమో?

ఆ ఆలోచన వెంటనే తుంచేశాడు గోపాలరావు.

అయినా ఏం చెయ్యడం?

ఒక నాణెం తీసుకుని, బొమ్మా బొరుసూ వేసి దాని ప్రకారమూ చేసే నిర్ధారణకి వొచ్చాడు గోపాలరావు. అయితే, అతనేంచేసినా, మిత్రులకి చెప్పదలుచుకోలేదు.

ఎంచేతంటే, తాను ఫూల్ కాదు.

అంచేత.

